# ముందుమాట

బ్రాహ్మణ ధర్మాన్ని గురించీ, బ్రాహ్మణీయ సంస్కృతి గురించీ మన విద్యా వ్యవస్థకు వెలుపల చర్చ చాలానే జరుగుతున్నది గానీ, మనదేశ అధికారిక విద్యావ్యవస్థ వాటిని ఆ పేర్లుపెట్టి పిలవడానికి సహితం ఇప్పటికీ సిద్ధంగా లేదు – కాషాయీకరణ మొదలయిన తరువాతేకాదు, అంతకుముందు కూడ. ఈ మేరకు కాషాయీకరణ కొత్తగా జరుగుతున్నది కాదు, ఎప్పుడూ ఉన్నదే.

ఈ పుస్తకంలోని వ్యాసాల రచయితలు ముగ్గురూ అధికారిక విద్యావ్యవస్థలో అధ్యాపకులే, కానీ ఈ రచనకు అందులో చోటెప్పుడు లభిస్తుందో ! అధికారిక విద్యావ్యవస్థ కులం అనేదొకటి ఉందని గుర్తిస్తుంది. దాని వికృత రూపాలలో ఒక్క అంటరానితనాన్ని మాత్రం ఖండిస్తుంది. అయితే అదేదో ఎవరి ప్రమేయం లేకుండా ఊడిపడిన అవలక్షణమైనట్టు నటిస్తుంది. దేశ సంస్కృతి అంటూ సగౌరవంగా ప్రస్తుతించే అనేక సంప్రదాయాలతో అది సన్నిహితంగా ముడిపడి ఉన్న విషయం తెలియనట్టు ప్రవర్తిస్తుంది.

ఈ నటన సాగినంత కాలం మన చరిత్రనూ సమాజాన్నీ సంస్కృతినీ నిజాయితీగా విశ్లేషించుకోవడం సాధ్యంకాదు. నిజాయితీ కొరవడిన సామాజిక శాస్త్రం శాస్త్రమూ కాదు, అది మనకిచ్చేది విజ్ఞానమూ కాదు.

భారత ప్రభుత్వ సమాచార ప్రసారశాఖ 'భారతదేశపు సాంస్కృతిక వైతాళికులు' అనే శీర్షికన 125 మంది 'దార్శనికులు, తత్త్వవేత్తలు, సాహితీవేత్తలు, ద్రష్టలు, శాస్త్రవేత్తలు, ధర్మ ప్రచారకులు, నాటక కర్తల'ను సగటు చదువరులకు పరిచయం చేసే గ్రంథమాలను ప్రచురించింది – అటల్‌బిహారీ ప్రధానమంత్రిత్వంలో కాదు, అపరలౌకికవాది ఇందిరా గాంధీ కాలంలోనే. ఈ పుస్తకంలో విశ్లేషించిన నలుగురు – కౌటిల్యుడు, మనువు, వాత్స్యాయనుడు, భరతుడు – 'వైతాళికుల' గురించేకాక మరొక్క 121 మంది గురించి కూడా దాదాపు ఇంతే నిడివిగల పరిచయ వ్యాసాలున్నాయి ఆ సంకలనంలో.

అవి చదివే 'సగటు చదువరి'కి ఈ దేశాన్ని గురించి కలిగే అభిప్రాయానికీ, ఈ పుస్తకం చదివేవారికి కలిగే అభిప్రాయానికీ హస్తిమశకాంతరం ఉంటుంది. అది నిజమయి ఇది అబద్ధమయి వుంటే ఏ సమస్యా ఉండేదికాదు. కాని అది అబద్ధం, ఇది నూటికి నూరుపాళ్ళు సత్యం కాకపోయినా సత్యాన్ని ఆవిష్కరించడానికి అవసరమైన విశ్లేషణా ప్రాతిపదికను గ్రహించిన ప్రయత్నం.

ఒక చారిత్రక వ్యక్తినీ, ఆ వ్యక్తి ఆలోచనలనూ అర్థం చేసుకోవాలంటే ఆ వ్యక్తి నమ్మిన ప్రాపంచిక దృక్పథాన్ని స్పష్టంగా మనముందు ఉంచుకోవాలి. దానిని అతని కళ్లతోనేకాక, ఆ దృక్పథం వ్యవస్థితం కావడం వల్ల స్వేచ్ఛ, జీవనం, విలువ, గుర్తింపు మొదలయిన హక్కులు కోల్పోయిన వారి కళ్లతోనూ చూడాలి. ఆ పైన విశ్లేషణ మన విశ్లేషణా దృక్కోణాన్ని బట్టి సాగుతుంది. అందులో చేతలకూ విభేదాలకూ ఎంతయినా అవకాశం ఉండవచ్చు.

ప్రభుత్వ ప్రచురణం సాంస్కృతిక వైతాళికుల గురించి ఏం చేప్తుంది? వారు అత్యంత ప్రాచీనులు. వేరే ఏ నాగరికతకూ తీసిపోనంత పూర్వకాలంలోనే మనం ఉన్నతస్థాయి ఆలోచనాపరులను కలిగివున్నాం. అంతవరకు కరెక్టే. ఎంత ప్రాచీనులు అని అడిగితే ప్రశ్నించే వాళ్లెవరూ లేరనుకుంటే మన దేశభక్తులు వీరి కాలాన్ని బాగా వెనక్కి నెట్టేస్తారుగానీ, మొత్తానికి ఈ విషయంలో మనం పాశ్చాత్యుల ముందేకాదు, చైనావారి ముందూ, పశ్చిమాసియవారిముందూ కూడా తలదించుకోనక్కరలేదు.

వారు విశ్లేషణా పటిమలోనూ విషయాలను గ్రహించే శక్తిలోనూ, సమగ్ర దృష్టిలోనూ వేరెవ్వరికీ తీసిపోరని కూడా అంటారు. అది కూడా నిజమే. కౌటిల్యుడు పాలనావ్యవస్థను విశ్లేషించేటప్పుడు అన్ని కోణాలనూ అసాధారణ సమగ్రదృష్టితో ఆకళింపుచేసుకున్నాడనీ, మనువు వ్యాజ్యాలనూ, న్యాయనిర్ణయ ప్రక్రియలను చాలా నిశితంగా వర్గీకరించాడనీ, భరతుడు జీవిత వస్తువుకూ దానిని వ్యక్తీకరించే అభినయానికీ అది ప్రేక్షకులలో కలిగించే అనుభూతికీ గల సంబంధాన్ని భావ-రస సిద్ధాంతం రూపంలో అసాధారణమైన నేర్పుతో వివరించాడనీ, లైంగిక అనుభవం ఎరుగని వాత్స్యాయనుడు ఆ అనుభవానికి సంబంధించిన అన్ని కోణాలనూ ఒక ఆధునిక సైంటిస్ట్‌లాగ విశ్లేషించాడనీ మెచ్చుకుంటారు. అభిమానులలో కొంచెం అతిశయోక్తి సహజం అని గుర్తించగలం కాబట్టి ఆ మేరకు ఈ అభిప్రాయాలను కొంచెం తగ్గించుకోవలసి ఉంటుందని అర్థం చేసుకుంటాం. అయినప్పటికీ ఇవి సత్యాలే.

ఇంకేం చెప్తారు? ఇంకేం చెప్పరు. ముఖ్యంగా ఈ వైతాళికుల ప్రాపంచిక దృక్పథాన్ని గురించి చెప్పరు. ఒకవేళ చెప్పినా దానిని వీలయినంత అస్పష్టంగా చెప్పి వదిలేస్తారు. మనిషికి జన్మనుబట్టి భిన్నమైన విలువను, హక్కులను, ప్రమాణాలనూ వర్తింపజేసే అమానవీయమైన నిచ్చెనమెట్ల వర్ణధర్మం వీరి విశ్లేషణా నైపుణ్యానికీ వాదనాపటిమకూ పునాది అని తెలియచేయరు.

ప్రభుత్వ సంకలనంలో మనువు గురించి రాసిన ప్రశాంత బిహారీముఖర్జీ అనే కలకత్తాకు చెందిన న్యాయకోవిదుడు, మనువు గొప్ప న్యాయసిద్ధాంతవేత్తే కాదు, గొప్ప సామాజిక తత్త్వవేత్త కూడానంటాడు. రాజ్యం, న్యాయవ్యవస్థ, అవి అమలు చేయవలసిన ధర్మాలదగ్గర మనువు ఆగిపోలేదనీ సృష్టి స్వభావంతో మొదలుపెట్టి ఒక సమగ్రమైన చిత్రాన్ని ఇచ్చాడనీ అంటాడు. ఆత్మ, పరమాత్మలగురించి, సత్వరజస్‌తమో గుణాల గురించి, కర్మవాసనల గురించి, జన్మపునర్జన్మల గురించి మనువు ఏం చెప్పాడో వివరిస్తాడు. ప్రపంచాన్ని సృష్టించిన బ్రహ్మ కాలచక్రాన్నీ, సకలలోకాలనూ, భూమ్యాకాశాలనూ సృష్టించి, ఆపైన పురుషుడినీ, స్త్రీనీ, కుటుంబాన్నీ, సమాజంలో సమతుల్యం నెలకోల్పే నాలుగు గుణాలనూ సృష్టించాడని మనువు వివరించాడని చెప్తాడు. ఆ గుణాలు బ్రాహ్మణులు ప్రాతినిధ్యం వహించే మేధస్సు, ఆధ్యాత్మికగుణాలు, క్షత్రియులు ప్రాతినిధ్యం వహించే సంరక్షక సంహార గుణాలు, వైశ్యులు ప్రాతినిధ్యం వహించే ఉత్పత్తి, వర్తక గుణాలు, శూద్రులు ప్రాతినిధ్యం వహించే భౌతిక సేవా పరిచర్యల గుణాలు అని వివరిస్తాడు. అక్కడితో ఆగక,

> "మనువు సామాజిక తత్త్వ దృక్పథంలోని చెప్పుకోదగ్గ విషయం, క్రమబద్ధమైన మానవ సమాజానికి తగిన బాధ్యతాయుతులయిన సభ్యులు తయారు కావడానికి జీవశాస్త్రాన్నీ జన్యుశాస్త్రాన్నీ ఆయన ఆశ్రయించిన వైనం. ఇది మనుసంహితంలోని 10వ అధ్యాయంలో కనిపిస్తుంది. సాంకర్యం మనిషి పునాది ధాతువులను ధ్వంసం చేస్తుందనీ సమాజం, రాజ్యం పతనం కావడానికి గల ప్రధాన కారణాలలో అది ఒకటనీ మనువు నమ్మాడు.
>
> . . . శరీరం, బుద్ధి, ప్రకృతి విధించిన పరిమితులనుండి, లేమినుండి విముక్తి మానవ సమాజం లక్ష్యం, రాజ్యం లక్ష్యం. మనిషయినా సమాజమైనా రాజ్యమయినా ఈ లక్ష్యానికి తోడ్పడినప్పుడే సార్థకం అవుతాయి. మనుసంహితంలోని 12వ అధ్యాయంలోని విషయం ఇదే. సామాజిక వ్యవస్థను ఒక సాధనంగా ఉపయోగించుకొని, దానిని అధిగమించడం ద్వారా మనిషి నిజమైన స్వేచ్ఛనూ విముక్తినీ పొందడం దీని సారాంశం."

అని అంటాడు. 'నాలుగుగుణాల సమతుల్యం' గల సామాజిక వ్యవస్థ స్వేచ్ఛకూ విముక్తికీ అవరోధం కాకపోగా అదే విముక్తికి సాధనం అనుకోవడం వల్ల, దానిని భ్రష్టు పట్టించగల సాంకర్యాన్ని గట్టిగా నిరోధించటం ముఖ్య కర్తవ్యం అనుకోవడంవల్ల ఏ సామాజిక ఫలితాలు సంభవించాయనే విశ్లేషణకు ఈ ప్రశంసలో చోటులేదు.

అందులో రెండవ అంశం ఈ పుస్తకంలోని వ్యాసాల ప్రధాన వస్తువు. 'సామాజిక సమతుల్యం' ప్రామాణికం అనుకోవడం, సేవకూ పరిచర్యలకూ ప్రతినిధులుగా

గుర్తించబడిన శూద్రులకూ వారికంటె నికృష్టమైన బతుకులు బతికే అతిశూద్రులకూ గుదిబండికాగా, సాంకర్యం సమాజాన్నీ రాజ్యాన్నీ దిగజారుస్తుందని నమ్మే దృష్టి స్త్రీ లైంగికతపైన, వైయక్తిక స్వేచ్ఛపైన, వ్యక్తిత్వ స్వయంప్రతిపత్తిపైన పెను నియంత్రణ. ఒక స్త్రీ వేరే కులానికి చెందిన మగవాడితో కలవకుండ చూడాలంటే కేవలం ఆమె లైంగిక స్వేచ్ఛపైన నియంత్రణ పెడితే చాలదు. ఆమెఎటుపోతుంది, ఎవరితో స్నేహం చేస్తుంది. ఏ జీవనమార్గాన్ని ఎంచుకుంటుంది. ఏం చదువుతుంది, ఏం ఆలోచిస్తుంది – అన్నిటినీ నియంత్రించాలి.

పితృస్వామ్యం అనే పెత్తందారీ సంబంధంలో స్త్రీ లైంగికతపైన నియంత్రణ ఒక ముఖ్య విషయం అనేది స్త్రీవాదం బలంగా నిరూపించిన విషయాలలో ఒకటి. అన్ని నాగరికతలలోనూ మగవాడు సార్వత్రికంగా అనుభవించే ఈ పెత్తనానికి గల కారణాల గురించి చాలా విశ్లేషణ జరిగింది. ఆస్తి తనకు పుట్టిన పిల్లలకే దక్కాలన్న కోరిక దగ్గరినుండి, మానసిక అభద్రత దాకా అనేక కారణాలు చర్చకు వచ్చాయి. అయితే హైందవ సమాజానికి వచ్చేసరికి సార్వత్రికమైన ఈ కారణాలకు వర్ణసాంకర్య భయాన్ని కూడా చేర్చాలి. చాతుర్వర్ణం పదిలంగా ఉండడం సంప్రదాయక హైందవ సమాజంలో అన్ని ఆలోచనలకూ తొలి ప్రమాణం. ఆ ఆలోచన రాజనీతిగురించి చేయొచ్చు. కళా సంస్కృతుల గురించి చేయొచ్చు, సుఖసంతోషాల గురించి చేయొచ్చు. దేనికయినా గీటురాయి వర్ణవ్యవస్థ పదిలంగా ఉండాలన్న ఆరాటం. ఇది ఏక సమయంలో కింది కులాలమీద, స్త్రీలపైన సార్వత్రిక నిర్బంధంగా పనిచేసింది. పాశ్చాత్య దేశాలలో రేస్, జెండర్‌ల మధ్యగల సంబంధానికీ, భారతదేశంలో కులం, జెండర్‌ల మధ్యగల సంబంధానికీ పోలిక తేవడం తరచుగా జరుగుతుంది. అసలే పోలికలేదని కాదుగానీ ఒక బలమైన తేడా ఉంది. కులం, జెండర్‌ల విషయంలో అధికారిక సంస్కృతిని నిర్దేశించే తాత్త్విక మూలం ఒకటే. బ్రాహ్మణీ యవర్ణధర్మం. అటువంటి మూలం పాశ్చాత్య సమాజంలో లేదు. భారతీయ సమాజానికి సంబంధించినంతవరకు వర్ణధర్మాన్ని ప్రస్తావించకుండ పురుష స్వామ్యం గురించి మాట్లాడలేము, లైంగిక అణచివేత గురించి మాట్లాడకుండ వర్ణ ఆధిక్యత గురించి మాట్లాడలేము.

విభిన్న సామాజిక జీవిత రంగాలకు సంబంధించి బ్రాహ్మణీయ సంస్కృతికి చెందిన నలుగురు ప్రముఖులుచేసిన రచనలలో ఈ సంబంధం ఏ విధంగా రూపుదిద్దు కుందో వివరణాత్మకంగా తెలియచేసే ఈ పుస్తకం అధికారిక విద్యావ్యవస్థలో ఇవ్వని విద్య చదువరులకు ఇస్తుందని ఆశిద్దాం.

కె. బాలగోపాల్